స్లిప్పులొచ్చాయా..!?

- ఓటర్లకు పోల్ చీటీలు పంపిణీ చేసిన బీఎల్ఓలు
- అందులోని వివరాల ఆధారంగా అవగాహన

భద్రాచలంఅర్బన్: తెలంగాణ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న దష్త్యా అధికార యంత్రాంగం ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా జిల్లా అధికారులు ఓటరు స్లిప్పులు, ఎపిక్ కార్డుల పంపిణీ చేశారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 9,66,439 మంది ఓటర్లు ఉండగా.. వారందరికీ పోల్ చీటీలు, కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఎపిక్ కార్డుల పంపిణీ అందజేశారు. పోస్టల్ సిబ్బంది, బీఎల్ఓలు ఇంటింటికీ వాటిని పంపిణీ చేశారు. అయితే ఈ పోల్ చీటీలలో ఏముంటుంది? కొత్తగా వచ్చిన మార్పులేంటి? అనే విషయాలను పరిశీలిద్దాం.

పూర్తి వివరాలతో..

పోల్ చీటీలపై ఓటరు పేరు, చిరునామా, ఓటరు సంఖ్య, పోలింగ్ కేంద్రం, పోలింగ్ తేదీ, సమయ, హెల్ప్ లైన్ నంబర్, పలు సూచనలతో పూర్తి వివరాలు నమోదు చేశారు. దీనిద్వారా పోలింగ్ రోజు ఓటర్లు సులువుగా కేంద్రానికి వెళ్లి ఓటువేసే అవకాశం ఉంటుంది. గతంలో వాటిని పార్టీల వారే ముద్రించి పంపిణీ చేసేవారు. అయితే ప్రచారం ముగిసిన తర్వాత పోల్ చీటీల పంపిణీ పేరుతో గుట్టు చప్పుడు కాకుండా ఆయా పార్టీల శ్రేణులు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని గమనించిన ఎన్నికల సంఘం దానిని నివారించింది. గత ఎన్నికల నుంచి అధికారికంగానే వీటిని పంపిణీ చేస్తున్నారు.



ఓటరు స్లిప్ వెనుక భాగంలో ముద్రించిన గూగుల్ మ్యాప్, ఇతర అంశాలు

అడ్రస్ చూపే మ్యాప్..

గతంలో పోల్ చీటీలో కేవలం ఓటరు ఫొటో, వివరాలు మాత్రమే ఉండేవి. ఈసారి ఎన్నికల్లో నూతన విధానంలో పోల్ చీటీలను రూపొందించారు. ఫొటో స్థానంలో క్యూఆర్ కోడ్ ఉంది. పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయం, పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబరు, గ్రామం, పోలింగ్ కేంద్రం, టోల్ ఫ్రీ నంబర్ ముద్రించారు. దాని వెనుక వైపు పోలింగ్ కేంద్రానికి సులువుగా చేరుకునేందుకు గూగుల్ మ్యాప్ ప్రింట్ చేశారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు బూత్ స్థాయి అధికారి పేరు, మొబైల్ నంబరు కూడా ప్రింట్ చేశారు. ఓటరు తెలుసుకోవాల్సిన నిబంధనలు అందులో వివరించారు.



స్లిప్ ముందు భాగంలో క్యూఆర్ కోడ్, సూచనలు

స్లిప్ అందలేదా.. నో ప్రాబ్లమ్..

బూత్ లెవల్ అధికారులు తమ బూత్ పరిధిలో ఇంటింటికీ తిరిగి పోల్ చిటీలను పంపిణీ చేశారు. ఇంట్లో ఉన్న ఓటర్లు అందరికీ ఓటరు పత్రాలు తీసుకున్నట్లు రసీదుగా రిజిస్టర్లో సంతకం లేదా వేలి ముద్రలను తీసుకుంటున్నారు. స్లిప్పులు ప్రతి ఓటరుకు అందేలా సూపర్వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. బీఎల్ఓలు ఇళ్లకు వెళ్లిన సమయంలో ఎవరైనా తాళం వేసి ఉండడంగాని, మరే ఇతర కారణాల తోగాని ఎవరికైనా స్లిప్పులు అందకుంటే కంగారుపడాల్సిన పనిలేదు. అందని వారికి పోలింగ్ రోజున బూత్లెవల్ అధికారులు హెల్ప్లైన్ సెంటర్లలో అందిస్తారు. అక్కడికి వెళ్లి మీ ఓటరు ఐడీ వివరాలు తెలిపితే సరిపోతుంది. ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ఈ స్లిప్పుతోపాటు ఎన్నికల సంఘం ప్రకటించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకెళితేనే ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇస్తారు.



ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్న బీఎల్‌వో (ఫైల్)

అభివృద్ధి కావాలా.. అరాచకం కావాలా!?

మణుగూరుటౌన్: మున్సిపాలిటీల్లో రోడ్లు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, ఐటీఐ కళాశాల మంజూరు చేయించిన తాను కావాలా లేక, శాంతంగా ఉన్న ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు గిరిజనేతరులు అంటూ విభేదాలు సృష్టించి తన మనుషులతో అరాచకాలు చేసిన వ్యక్తి కావాలో ఆలోచించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. శనివారం చిక్కుడుగుంట నుంచి వేలాది మోటార్‌సైకిళ్లతో ప్రారంభమైన ప్రచారం పలు ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను అధికారంలోకి రాబోయే కాంగ్రెస్ పార్టీ పాలనలో పర్మినెంట్ కోసం కృషి చేస్తానన్నారు. మణుగూరు మున్సిపాలిటీలోని కొన్ని గ్రామాలను పూర్తిస్థాయి గ్రామ పంచాయతీలుగా మార్చి పూర్తి స్థాయి మున్సిపాలిటీగా మారుస్తానని హామీనిచ్చారు. బీఆర్ఎస్‌లో ఉండి రేగా కాంతారావు మున్సిపాలిటీకి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వ్యవస్థలో అన్నివర్గాలు, కులాలు సంతోషంగా జీవించాలన్నదే పాయం వెంకటేశ్వర్లు అభిమతమని, భూ కబ్జాలు, ఫారెస్ట్ భూములు, సెటిల్మెంట్లు, ఇసుక దందాలు, ఇంటి స్థలాలు కబ్జా చేసి అధికార మదమే శాశ్వతం అనుకునే రేగాకు ఓటు వేస్తే మీ ఇల్లు మీరే కొనుక్కునే పరిస్థితులు దాపురిస్తాని అన్నారు. అటువంటి వ్యక్తికి, బీఆర్ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పి, కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు బొల్లోజు అయోధ్య, తెదేపా నేత వట్టం నారాయణ దొర, కాంగ్రెస్ నాయకులు చందా సంతోష్, బట్టా విజయ్‌గాంధీ, కాటబోయిన నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నేత త్యాగరాజన్, వైఎస్ఆర్ టీపీ నేత బుర్రా సోమేశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ ఎంపీపీ కేవీరావు, సమితిసింగారం ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్, గుడిపూడి కోటేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వెలగపల్లి జాన్, టీఎన్టీయూసీ, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు

కాంగ్రెస్‌లో ఎంపీటీసీ చేరిక

కరకగూడెం: మండల పరిధిలోని సమత్ మోతె (గొల్లగూడెం) ఎంపీటీసీ మునింద్ర అధికార బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో శనివారం ఆ పార్టీ పినపాక అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో చేరారు. ఈ సందర్భంగా పాయం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోకాళ్ళ పాపారావు, పార్టీ సీనియర్ నాయకులు ఎట్టి నర్సయ్య, ఎర్ర సురేష్, ఇర్ప రవి, ఎల్లబోయిన సత్యం, వడ్లకొండ సాంబశివరావు, ఎల్ల బోయిన బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

డబ్బు బలం.. ప్రజాబలం మధ్యే పోరు

భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి వీరయ్య

చర్ల/వాజేడు: డబ్బు బలం, ప్రజా బలం మధ్యే ఎన్నికల పోరు జరుగుతోందని.. అయితే, ఈ పోరులో ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య వెల్లడించారు. చర్ల మండల కేంద్రం, పలు గ్రామాలతో వాజేడు మండలం ఎడ్జర్లపల్లిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లుగా పాలిస్తున్నబీఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలొచ్చే సరికి డబ్బు సంచులతో వస్తున్నారని మండిపడ్డారు. చర్లకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ కావాలని కోరితే పట్టించుకోలేదని ఆయన గుర్తు చేశారు. అలాగే, భద్రాచలానికి నిధులు ప్రకటించినా ఇవ్వకుండా దేవుడితోపాటు ప్రజలను కేసీఆర్ మోసం చేశాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పేలా తనను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, నాయకులు నల్లపు దుర్గాప్రసాదరావు, పరుచూరి రవికుమార్, ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, యగ్గడి అంజయ్య, వాసు, ప్రసాద రాజు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నాయకుల ప్రచారం..

చర్ల: మండలంలోని సరిహద్దు ఆదివాసీ గ్రామాల్లో శనివారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పలు మావోయిస్టు ప్రాబల్య గ్రామాల్లో భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ప్రచార కార్యాక్రమంలో బీజాపూర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజు, మున్సిపల్ చైర్మన్ జాకీర్, ఎంపీపీ సున్నం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: ప్రచారంలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

అత్యధిక మెజారిటీ సాధిస్తాం..

దుమ్ముగూడెం/భద్రాచలంటౌన్: భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యకు మండలంలో అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామని సర్పంచ్‌లు తెలిపారు. దుమ్ముగూడెంలో శనివారం మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు ఆధ్వర్యాన సర్పంచ్‌లు సమావేశమై మాట్లాడారు. సర్పంచ్‌లు తెల్లం వరలక్ష్మి, వర్సా శివరామకృష్ణ, మడకం చంద్రశేఖర్, కొమరం బాలకృష్ణ, మడకం నాగేంద్రబాబు, కొర్సా అశ్విని, కట్టం కృష్ణ, కొర్స సునీత, పూజారి మోహన్‌రావు, వర్స చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఇక భద్రాచలం పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యను గెలిపించాలని కోరుతూ నాయకులు ప్రచారం చేశారు. టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ మాట్లాడగా, సరెళ్ల నరేష్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, సతీష్, వెంకటేశ్వర్లు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రచార పర్వం

అశ్వాపురం: మండలంలో పలు గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ పినపాక నియోజకవర్గం అభ్యర్థి పొడియం బాలరాజు శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు కోరారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, సర్పంచ్‌లు పూనెం కనక దుర్గ, మీడియం జయ పాల్గొన్నారు.

బూర్గంపాడు: పినపాక ఎన్డీ అభ్యర్థి ఈసం కృష్ణన్న విజయాన్ని కాంక్షిస్తూ శనివారం బూర్గంపాడు మండలంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వైఎస్‌రెడ్డి, ఆదిలక్ష్మి, నలమాసు నాగన్న,ప్రణయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అవార్డు

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థిని చిట్టూరి దుర్గాభవాని రాష్ట్ర స్థాయి అవార్డు సాధించింది. సత్యసాయి సేవా సమితి నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం ఆమెను విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు అభినందించారు.

మహిళల విషయంలో గౌరవంగా ఉండాలి

అశ్వాపురం: మహిళల విషయంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా ఉండాలని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నకుమారి అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెంలోని కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి మిట్టగూడెం, కల్యాణపురం వరకు ర్యాలీ నిర్వహించారు. సమాజంలో స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ మనీషా, విద్యార్థులు పాల్గొన్నారు.



అశ్వాపురం: మిట్టగూడెంలో ర్యాలీ తీస్తున్న ప్రిన్సిపాల్ స్వప్నకుమారి, విద్యార్థులు

మహిళలకు అండగా సఖి సెంటర్

అన్నపురెడ్డిపల్లి: ఆపదలో ఉన్న మహిళలకు అండగా సఖి సెంటర్ పనిచేస్తుందని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ అధికారిణి నిర్మలాజ్యోతి అన్నారు. శనివారం మండలం పరిధిలోని పెంట్లం, నామవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'స్త్రీలపై హింసా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని' పురస్కరించుకొని కొత్తగూడెం సఖి సెంటర్ సిబ్బందితో కలిసి ఆమె అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీలపై జరిగే అత్యాచారాలు, అరాచకాలపై స్పందించేందుకు 24 గంటలూ సఖి సెంటర్ పని చేస్తుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతులకు టెక్నికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని యువతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ మిషన్ కో–ఆర్డినేటర్ సంతోషిరూప, సఖీ సభ్యులు రాజమణి, శారద, స్వాతి, సూపర్‌వైజర్లు అరుణ, గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

రామాలయ సిబ్బందికి సన్మానం

భద్రాచలంటౌన్: ఏపీలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పది రోజుల పాటు భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించి భద్రాద్రి చేరుకున్న రామాలయ సిబ్బందిని ఈఓ రమాదేవి శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 25 వరకు రామాలయ ప్రచార రథంతో పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో సీతారాముల వారి కల్యాణ మహోత్సవాలను కనులపండువగా నిర్వహించాని అభినందించారు.



అర్చకులు, సిబ్బందితో ఈఓ రమాదేవి

'ఉద్యోగుల ఓటుపై ప్రభుత్వానికి భయం'

భద్రాచలంటౌన్: ఉద్యోగులు ప్రభుత్వ వ్యతిరేక ఓటు వేస్తారని బీఆర్ఎస్ భయ పడుతోందని, అందువల్లే స్థానికంగా విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఇంతవరకు అందించలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సరెళ్ళ నరేష్ శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు ఎలక్షన్ కమిషన్ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించగా.. భద్రాచలం నియోజవర్గంలో సిబ్బంది విషయంలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు.

కావాలనే కొందరు అధికారులు ఇప్పటి వరకు పోస్టు బ్యాలెట్ పంపించలేదని, ఉద్యోగులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం నిలబడలేదని అన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం, బీజీ కొత్తూరు గ్రామాలకు చెందిన ఇద్దరు ఇటీవల తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ లో ఆన్‌లైన్ చేయగా సీఐ రవీందర్ ఆధ్వర్యంలో మొబైల్‌ఫోన్లు గుర్తించి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు వ్యక్తులకు సీఐ రవీందర్ ఫోన్లు అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. ఎవరు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయించాలని సూచించారు.



మొబైల్ ఫోన్ అందజేస్తున్న సీఐ రవీందర్

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మండలంలోని అశోక్‌నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కారం సీతారామయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె.మీరాహుస్సేన్, కోశాధికారిగా ఇనపనూరి రత్నప్రసాద్, ఉపాధ్యక్షులుగా తోట విజయలక్ష్మి, వజ్జా కృష్ణమూర్తితో పాటు 16మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బి.రాము, జిల్లా పరిశీలకులుగా కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు వ్యవహరించి నూతన కమిటీతో ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన కమిటీ వారు మరింత బాధ్యతతో పని చేస్తూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, స్వరూపారాణి, పూజిత, త్రినాథ్, బాయమ్మ, సునీత, రాజకుమార్, కొమరం నరసింగరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మొద్దు..



అశ్వాపురం: వేములూరు ప్రచారంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

అశ్వాపురం: కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మి ప్రజలు కష్టాలు తెచ్చుకోవద్దని పినపాక నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని అశ్వాపురం నుంచి మనుబోతులగూడెం వరకు పలు గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో చర్చిలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలలో ప్రజలను ఉద్దేశించి రేగా మాట్లాడారు. బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని, కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యం కాని హామీలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎన్నికల్లో కారు గుర్తుపై ఓట్లు వేసి తనను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, రైతుబంధు సమితి మండల కన్వీనర్ గజ్జల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేగా గెలుపునకు సహకరించాలి

మణుగూరురూరల్: ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పినపాక అసెంబ్లీ అభ్యర్థి, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు గెలుపునకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే సతీమణి రేగా సుధారాణి విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని వాసవినగర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ కార్మిక సంఘాల అధ్యక్షులు కత్తి రాము ఆధ్వర్యంలో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ అండ్ ట్రేడ్ యూనియన్, మండల ఎలక్ట్రిషియన్స్, ప్లంబర్స్, హెల్పర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రేగా సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన రేగా కాంతారావును ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూనియన్ సంఘాల వారు మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వట్టం రాంబాబు, ఎస్‌కె.మౌలానా, ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ అండ్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్‌కె.నాగుల్‌మీరా, వెంకటేశ్వర్లు, సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాలమహానాడు మద్దతు..

అశ్వాపురం: మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న పినపాక నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావును బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కర్నె మురళి ఆధ్వర్యంలో శనివారం మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్, దళిత సంఘాల నాయకులు కలిశారు. పినపాక నియోజకవర్గంలోని ప్రతీ దళితుడూ రేగాకు మద్దతు తెలిపేలా తీర్మానించామని రవీందర్ తెలిపారు.

గ్యారంటీలను అమలు చేసి తీరుతాం..



చంద్రుగొండ: పోకలగూడెంలో కార్యకర్తలతో కలిసి నృత్యం చేస్తున్న జారే ఆదినారాయణ

చంద్రుగొండ: అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని అశ్వరావుపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జారె ఆదినారాయణ అన్నారు. మండలంలో శనివారం ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేద బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఉపయుక్తంగా ఉండే పథకాల అమలు కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం బాధ్యత తీసుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు అన్ని విధాలుగా మోసపోయారని ఆయన విమర్శించారు. బాలికుంట, బెండాలపాడు, గుర్రాయిగూడెం, దుబ్బతండా, మంగయ్యబంజర్, రావికంపాడు, బాల్యతండా, వెంకటియాతండా, సామ్యాతండా, వంకనెంబర్, కరిశెలబోడులో జారే ఎన్నికల ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా పోకలగూడెం గ్రామంలో ప్రధాన సెంటర్ ఆటాపాట సాగింది. ఈ క్రమంలో కార్యకర్తలతో కలిసి జారే నృత్యం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఈ ప్రచారపర్వంలో ఎంపీపీ బాణోత్ పార్వతి, మాజీ ఎంపీపీలు గుగులోతు బాబు, గుగులోతు మీన, నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, దారం గోవిందరెడ్డి, ఇంజం అప్పారావు, గుగులోతు రాములు, బడుగు శంకర్ పాల్గొన్నారు.



దమ్మపేట: ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

జారెకు మద్దతుగా ప్రచారం

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణ గెలుపు కాంక్షిస్తూ, మండల కేంద్రంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శనివారం దమ్మపేట గ్రామంలోని బంజారా కాలనీలో కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరుతూ, కాంగ్రెస్, సీపీఐ నాయకులు కలసి ప్రచారం చేశారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలంటే హస్తం గుర్తుకు ఓటేసి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల రాంబాబు, చక్కిరాల మల్లేశ్వరరావు, రొయ్యల కుమార్, మళ్ల చిన్నా, నాగమణి పాల్గొన్నారు.